సాక్షి సూర్యాపేట

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



ముగిసిన అర్వపల్లి దర్గా ఉర్సు

అర్వపల్లి శివారులోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు శనివారం రాత్రితో ముగిసింది. - 8లో



ఆనందంలో ఆయకట్టు రైతులు

నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగు నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. - 8లో



ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్

నాగార్జునసాగర్ డ్యాంపై రెండు తెలుగు రాష్ట్రాల ఆక్టోపస్ దళాలు శుక్రవారం అర్ధరాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించాయి. - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు బాసటగా భద్రత స్కీం



చెక్ అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : పోలీస్ కుటుంబాలకు బాసటగా భద్రత స్కీమ్ ఉందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత స్కీమ్ ద్వారా రూ.8 లక్షల చెక్కును శనివారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఓ మంజు భార్గవి, పోలీసు సంక్షేమ సంఘం సెక్రటరీ వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ పాల్గొన్నారు.

కోదాడ పెద్దచెరువు సర్వే ప్రారంభం



సర్వే చేయాల్సిన తీరును సిబ్బందికి వివరిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడ: కోదాడ పెద్దచెరువు ఆక్రమణలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మున్సిపాలిటీ అధికారుల సమక్షంలో కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు మూడు టీంలుగా ఏర్పడి ఈ సర్వే చేయనున్నారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా రిజ్వీ ఉన్న సమయంలో చేసిన సర్వే రిపోర్టు ఆధారంగా రీసర్వే చేసి ఆక్రమణలను గుర్తించనున్నారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో సర్వే పనులను చేపడతామని, వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి ఆక్రమణలను గుర్తించి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజిద్‌అలీ, ఇరిగేషన్ డీఈ సువర్ణరేఖ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుడి క్షేత్రం.. భక్తజన సంద్రం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. అదే విధంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వ్రతాలు, వివిధ విభాగాల ద్వారా నిత్యాదాయం రూ.52,60,773 సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

తరగతుల బహిష్కరణ



ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ ఘటనలను నిరసిస్తూ శనివారం సూర్యాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల తరగతులు బహిష్కరింపజేస్తున్న పీడీఎస్‌యూనాయకులతో విద్యార్థులు

టీజీపీఎస్సీ కొత్త చైర్మన్ వెంకటేశం సర్వేల్ పూర్వ విద్యార్థి

- ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మహేందర్‌రెడ్డి కూడా..



సంస్థాన్ నారాయణపురం: టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకు ల పాఠశాల పూర్వ విద్యార్థి. వెంకటేశం ఈ గురుకులంలో 1983–84 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశారు. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థే.

ఖరారుకాని ప్రణాళిక

- యాసంగి సాగు ప్రణాళిక రూపకల్పనలో తీవ్ర జాప్యం
- ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వ్యవసాయ అధికారులు నిమగ్నం
- ఇప్పటికే జిల్లాలో మొదలైన యాసంగి సీజన్ పనులు
- ఎరువులు, విత్తనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతుల వినతి



ఎదుగుతున్న వరినారు

భానుపురి (సూర్యాపేట) : యాసంగి సాగు ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. ఏటా ఈ సమయానికే జిల్లాలో ఏ మండలంలో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగవుతుందన్న వివరాలతో వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించేవారు. దీని ప్రకారం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేవారు. కానీ ఇప్పటికే రైతులు యాసంగి పంటల సాగు మొదలు పెట్టినప్పటికీ అధికారులు మాత్రం ప్రణాళిక రూపకల్పనలో జాప్యం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలులో నిమగ్నం..

జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఏటా వానాకాలం, యాసంగి సీజన్లకు వేరువేరుగా సాగు ప్రణాళిక తయారు చేస్తుంటారు. ఈ వానకాలం సీజన్‌లో సాగు ప్రణాళికను సీజన్‌కు ముందుగానే తయారు చేసినప్పటికీ యాసంగి ప్రణాళిక రూపొందించడంలో అధికారులు కొంత వెనుకబడ్డారు. ప్రస్తుతం జిల్లాలో వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 300లకు పైగా కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం తేమశాతం చూస్తూ ఎప్పటికప్పుడు నిర్వాహకులకు అందుబాటులో ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో యాసంగి సాగు ప్రణాళిక కొంత ఆలస్యం అయినట్లు తెలుస్తోంది. అయితే వానాకాలం సీజన్లో ప్రభుత్వం చేపట్టిన పంటల నమోదు ప్రక్రియలో వ్యవసాయ అధికారులు వెనుకబడ్డారు.

మొదలైన యాసంగి పనులు..

ఏటా జిల్లాలో నవంబర్ రెండవ వారం నుంచి యాసంగి సీజన్ కు సంబంధించి వరి సాగు పనులను రైతాంగం చేపడుతుంది. ఇప్పటికే అక్కడక్కడ వేరుశనగ, పెసర పంటలు వేస్తున్నారు. కొంతమంది జనవరి వరకు మెట్ట పంటల సాగు చేయనున్నారు. జిల్లాలో బోరు బావుల కింద వరి పంటను సాగు చేసే రైతులు యాసంగి సీజన్ కు సంబంధించి నవంబర్ రెండో మాసంలోనే నారుమడులను సిద్ధం చేసుకుని నార్లు పోస్తుంటారు. ప్రస్తుతం వరి నాట్ల కంటే డ్రం సీడర్, వెదజల్లే విధానానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతుండడంతో అక్కడక్కడ వరి పొలాలను దమ్ము చేసే పనులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో యాసంగి సాగుకు కావాల్సిన విత్తనాలు ఎరువులను సిద్ధం చేసేందుకు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికను ఖరారు చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో సిద్ధం చేస్తాం

జిల్లాలో వరి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ అధికారులు ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలోనే యాసంగి సీజన్ కు సంబంధించి సాగు ప్రణాళికను సిద్ధం చేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తాం.

– శ్రీధర్ రెడ్డి , జిల్లా వ్యవసాయ అధికారి

అందరినీ కలుపుకొనిపోవాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుపోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌లు హుజూర్‌నగర్ పట్టణ సమగ్ర అభివృద్ధి పనులపై శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రింగ్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. కోర్టు వివాదంలో ఉన్న ఇళ్ల యజమానులను పిలిపించి మాట్లాడి తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లపుదాస్ కృష్ణ గౌడ్, సులువ చంద్రశేఖర్, పారా సాయి, రాజా పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

భానుపురి (సూర్యాపేట) : ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హైదరాబాద్ ఇంజనీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జీలు పల్లె పిచ్చయ్య, ఆంజనేయులు, రామకృష్ణ తెలిపారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము స్వామి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా హరికృష్ణ, ధరా వత్ బాలు నాయక్, సహాయ కార్యదర్శులుగా వెంకట హర్ష, పద్మావతి, కార్యదర్శిగా రెడ్డి మల్ల నగేష్, కార్యవర్గ సభ్యులుగా తిరుమలేష్, చందన, మహేష్, స్వరూపలను ఎన్నుకున్నా రు. సమావేశంలో పాండు నాయక్, మల్సూర్, పిడమర్తి లింగయ్య, రవి కిరణ్, ఉదయ్, స్వప్న, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎన్నికైనవారిని సన్మానిస్తున్న సభ్యులు

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



చికిత్స వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘించి చికిత్స అందిస్తున్నట్టు తమకు సమాచారం వస్తుందని, అలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. శనివారం సూర్యాపేటలోని శ్రీహాస్ హాస్పిటల్, సాయి దీప్తి నర్సింగ్ హోమ్, సాయి ప్రసాద్ హాస్పిటల్, వికేర్ హాస్పిటళ్లను తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వంటగదికి బైబై చెప్పేస్తున్నారు. నచ్చిన హోటల్‌కి, మెచ్చిన చోటుకు వెళ్లి తినడం కూడా మానేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి బయటికి వెళ్లి నచ్చింది లాగించడం కూడా తగ్గించారు. ఇప్పుడు నచ్చిన ఫుడ్, మెచ్చిన హోటల్‌కు ఆర్డర్ పెట్టేసి.. ఉన్న చోటుకే తెప్పించుకుంటున్నారు. ఇప్పుడుఈ ట్రెండ్ చిన్న పట్టణాలకు సైతం విస్తరించింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టడం.. రాగానే ఆరగించడానికి అలవాటు పడుతున్నారు.

– రామగిరి(నల్లగొండ), సూర్యాపేట టౌన్

ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లకు పెరిగిన డిమాండ్

- చిన్న పట్టణాల్లోనూ విస్తరిస్తున్న ఫుడ్ డెలివరీలు
- ప్రముఖ రెస్టారెంట్లు, బేకరీలు, హోటళ్ల నుంచి ఫుడ్ అందిస్తున్న ఆయా సంస్థలు
- నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడలో రోజూ వెయ్యి వరకు ఆర్డర్లు

సండే స్పెషల్

రోజూ ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు.. (సగటున)

	స్విగ్గీ		జొమాటో
నల్లగొండ	300	డైలీ	400
	500	వీకెండ్స్	600
సూర్యాపేట	300	డైలీ	450
	500	వీకెండ్స్	650
మిర్యాలగూడ	200	డైలీ	250
	300	వీకెండ్స్	400



ఒకప్పుడు ఆకలేసిందంటే ఇంట్లో వండింది తినడం, లేదా బయట హోటల్‌కు వెళ్లి తినడం చేసేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. మనం ఇంట్లో.. ఆఫీస్‌లో.. స్నేహితులతో బయట.. ఎక్కడున్నా ఉన్న చోటుకే ఆహారం వస్తోంది. మనకు నచ్చిన ఆహారాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి తెప్పించుకోవచ్చు. ప్రజల అభిరుచిని తీర్చేందుకు ప్రస్తుతం ఫుడ్ డెలివరీ రంగంలో ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడలో స్విగ్గీ, జొమాటో లాంటి సంస్థలు ఉన్నాయి. నల్లగొండలో మాత్రమే ప్రత్యేకంగా పిక్ ఈజీ ఫుడ్ డెలివరీ సంస్థ ఉంది. క్రమంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలపై ఆధారపడేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ఆయా సంస్థలు కొన్ని సార్లు ఫ్రీ డెలివరీ, డిస్కౌంట్, వన్ ప్లస్ వన్ లాంటి ఆఫర్లు ఇస్తూ ప్రజలను మరింత ఆకర్షిస్తున్నాయి.



ఉన్న చోటుకి ఫుడ్ డెలివరీ

ఇంట్లో అందరూ ఉద్యోగస్తులు, వ్యాపార పనుల్లో బిజీగా ఉండి వంట చేసుకోవడం వీలు కాదు. ఏదైనా స్పెషల్ డే ఉన్నప్పుడు వంట చేయడం మానేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి తెప్పించుకుందాం అనే ధోరణి పెరిగింది. ఫుడ్ డెలివరీ సంస్థలు ప్రముఖ రెస్టారెంట్లు, బేకరీలు, హోటళ్లతో అనుసంధానమై.. కోరిన చోటు నుంచి ఉన్న చోటుకు ఫుడ్, జ్యూస్‌లను చేరవేస్తున్నాయి. నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేటలో ప్రస్తుతానికి ఫుడ్ డెలివరీ సదుపాయం ఉంది. ఆయా చోట్ల రోజూ వెయ్యి వరకు ఆర్డర్లు వస్తున్నాయంటే ఆన్‌లైన్ ఫుడ్‌కు ఎంత డిమాండ్ ఉందో చెప్పవచ్చు. ముఖ్యంగా స్టూడెంట్స్, బ్యాచిలర్స్, ఉద్యోగస్తులు ఎక్కువగా ఫుడ్ డెలివరీని వినియోగిస్తున్నారు. వీకెండ్స్‌లో ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసుకునేందుకే మొగ్గు చూపుతున్నారు.

సర్వీస్ చార్జి తక్కువ



పిక్‌ఈజీ నల్లగొండలో మొదటిసారిగా ప్రారంభించాం. అన్ని ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌ల మాదిరిగానే పిక్ ఈజీ ద్వారా ఫుడ్ డెలివరీ అవుతుంది. మెనూ చార్జిపై కేవలం 5 శాతం సర్వీస్ చార్జి వేస్తాం. నల్లగొండ నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఫుడ్ డెలివరీ చేస్తాం. పిక్‌ఈజీ కేవలం వాట్సాప్ ద్వారా సులువుగా ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చు. 2023 సెప్టెంబర్‌లో ఈ డెలివరీని ప్రారంభించి ఇప్పటి వరకు వెయ్యి వరకు ఆర్డర్లు చేశాం. కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తున్నందున త్వరలో నార్కట్‌పల్లి, మిర్యాలగూడ ప్రాంతాల్లో మా సర్వీసెస్ ప్రారంభిస్తాం. త్వరలో బాక్స్ ఈజీని ప్రవేశపెట్టనున్నాం. దీని ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే చోటుకి, స్కూల్స్, కాలేజీలకు క్యారేజీని తీసుకెళ్తాం.

– కె.విష్ణువర్ధన్‌రెడ్డి, పిక్‌ఈజీ సంస్థ యజమాని

60 మంది డెలివరీ బాయ్స్ ఉన్నారు



స్విగ్గీ సంస్థ ద్వారా నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేటలో ఫుడ్ డెలివరీ జరుగుతుంది. సూర్యాపేటలో ఆర్డర్లు ఎక్కువగా ఉంటాయి. స్విగ్గీలో మూడు ప్రాంతాల్లో మొత్తం 60 మంది వరకు డెలివరీ బాయ్స్ పని చేస్తున్నారు. రోజుకు సుమారు 900 నుంచి 1000 వరకు ఆర్డర్లు వస్తున్నాయి. అన్ని రెస్టారెంట్లు, బేకరీలు, హోటళ్ల నుంచి ఫుడ్ సరఫరా చేయడం మా ప్రత్యేకత.

– ఇమ్రాన్, స్విగ్గీ టీమ్ లీడర్, నల్లగొండ



రోజూ 15 ఆర్డర్ల వరకు చేస్తా



నేను సూర్యాపేటలో నాలుగేళ్లుగా స్విగ్గీ, జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం స్విగ్గీలో ఉన్నాను. రోజుకు 10 నుంచి 15 ఆర్డర్లు వస్తున్నాయి. ఎక్కువగా బిర్యానీ ఆర్డర్లు వస్తాయి. శని, ఆదివారాల్లో 20 వరకు ఉంటాయి. స్విగ్గీలో ఆర్డర్ చేసుకున్న వారికి 15 నిమిషాల్లోనే పార్సిల్ అందిస్తా. ఉదయం టిఫిన్లు కూడా ఆర్డర్లు వస్తాయి.

– మహ్మద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా, స్విగ్గీ డెలివరీ బాయ్, సూర్యాపేట

రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న కేంద్రం

- హామీలు అమలైనప్పుడే రైతులకు పండుగ
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భానుపురి (సూర్యాపేట) : రాజ్యాంగ విలువలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, శాసనమండలి మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీపీఎం తృతీయ జిల్లా మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలోని మూలసూత్రాలైన ప్రజాస్వామ్యం , లౌకికవాదం, సామాజిక న్యాయం లేకుండా తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. రాష్ట్ర హక్కులను కాలరాస్తూ ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మతం , ఒకే ఎన్నిక అంటూ రాజ్యాంగ విలువలను సర్వనాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రైతు పండుగ పేరుతో చేస్తున్న కార్యక్రమాలు ప్రచారానికి మాత్రమేనని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలైనప్పుడు మాత్రమే రైతులకు నిజమైన పండుగ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. అంబానీ, అదానీలపై యుద్ధం చేస్తున్నారని చెబుతుంటే రాష్ట్రంలో మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదానీ వద్ద రూ.100 కోట్ల విరాళం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ ముందుకు రావడం లేదన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాలో పార్టీ ప్రజా పోరాటాల నిర్మాణ నివేదికను జిల్లా కార్యదర్శి నాగార్జున్ రెడ్డి ప్రవేశపెట్టారు. మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, శేఖర్ రావు, వెంకటేశ్వరరావు, సైదులు, ఏకలక్ష్మి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల రవి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాగారపు పాండు, కొలిశెట్టి యాదగిరిరావు, వెంకయ్య పాల్గొన్నారు.



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

ప్రాధాన్యతా రంగాలకు రుణాలు ఇవ్వాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ప్రాధాన్యతా రంగాలకు అధిక మొత్తంలో రుణాలు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ సమావేశంలో మాట్లాడారు. కొన్ని బ్యాంకులు తమ లక్ష్యం సాధించడంలో సహకరించడం లేదన్నారు. వార్షిక ప్రణాళికకు సంబంధించి 2024 –25 సంవత్సర లక్ష్యం రూ.8994.16 కాగా రెండవ త్రైమాసానికి రూ.5700.39 కోట్లు (63.38 శాతం) సాధించారని ఎల్‌డీఎం బాపూజీ తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, డీటీడీఓ శంకర్, ఆర్బీఐ ఏజీఎం గౌతమి, డీడీఎం సత్యనారాయణ, ఎల్‌బీఐ ఆర్ఎం ఉపేంద్ర భాస్కర్, యూబీఐ డీజీఎం హనుమంత రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్ పాల్గొన్నారు.

ప్రజాపాలన ఉత్సవాలు విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన ఉత్సవాలు విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. ప్రజా పాలన కార్యక్రమాలపై శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా అధికారులు నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్కారు ప్రకటించిన లోగో తెలంగాణ రైసింగ్ వన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రొటోకాల్ తప్పక పాటించాలని ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో పిల్లలకు ×పునరుత్పాదక ఇంధన వనరుల్లు పై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి అశోక్ ను ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను నిరంతరం పరిశీలించి నివేదికను సమర్పించాలన్నారు. కుటుంబ సర్వే డేటా ఎంట్రీ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 3న కలెక్టరేట్లో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నృత్య నాటకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ వివి అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీపీఓ ఎల్ .కిషన్, డీఈఓ అశోక్, డీటీడీఓ శంకర్, బీసీ అభివృద్ధి అధికారి అనసూయ, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ వెంకటయ్య , మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీష్ రెడ్డి ,డీడబ్ల్యూ ఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ఆనందంలో ఆయకట్టు రైతులు


- నిండుకుండలా మూసీ ప్రాజెక్టు
- యాసంగి సాగుకు డోకా లేదంటున్న అన్నదాతలు
- దొడ్డు రకం సాగు వైపే మొగ్గు
- ఇప్పటికే నార్లు పోసుకున్న రైతులు

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగు నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈ ఏడాది జూన్‌లోనే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు కురవడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 644.80(గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) అడుగుల నీరు ఉంది. యాసంగి సీజన్ వరి నారు పెంపకం కోసం అధికారులు కుడి, ఎడమ కాల్వలకు వారం రోజుల నుంచే 100 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల చేస్తున్నారు. మూసీ ఆయకట్టు పరిధిలో అధిక శాతం రైతులకు వ్యవసాయ బావులు, బోర్లు కూడా ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో కాల్వలకు నీటిని విడుదల చేయడంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి.

ఆయకట్టు ఇలా..

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎనిమిది మండలాల్లో 42 గ్రామాల పరిధిలో అధికారికంగా 30వేల ఎకరాల్లో మూసీ ఆయకట్టు విస్తరించి ఉంది. దీంతో పాటు రైతులు కాల్వలకు విద్యుత్ మోటార్లు వేసి అనధికారకంగా మరో 15వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇది కాకుండా బోర్లు, బావులు, చెరువుల కింద సాగు చేసే వారు ఉన్నారు. మూసీ ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి, వేములపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, మిర్యాలగూడ మండలాల్లోని 14,770 ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. ఎడమ కాల్వ ద్వారా సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల, పెన్‌పహాడ్, సూర్యాపేట మండలాల పరిధిలోని 14గ్రామాల్లో 15,230 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది..


మూసీ ఆయకట్టులో వరి నారు పోసిన రైతులు


నిండుకుండలా మూసీ రిజర్వాయర్

సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

ప్రస్తుతం మూసీ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండటంతో ఆయకట్టు పరిధిలోని 30వేల ఎకరాల భూముల్లో యాసంగి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వానాకాలంలో సాగు చేసిన పంటల అవశేషాలను తొలగించి ఎలగడ దుక్కులు దున్నుతున్నారు. ముందుగా వానాకాలం కోతలు పూర్తి చేసుకున్న రైతులు ఇప్పటికే నార్లు పోసి పదిహేను రోజులు కావొస్తుంది. కొంత ఆలస్యంగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు నార్లు పోసేందుకు మడులు సిద్ధం చేస్తున్నారు. ఆయకట్టులో 90 శాతం మంది రైతులు తమకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. యాసంగి సీజన్‌లో సన్న రకాలు సాగు చేస్తే దిగుబడి తక్కువ వస్తుందనే భావనలో ఉన్న రైతులు ఎక్కువగా దొడ్డు రకాల సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం నీటి విడుదలపై ప్రకటన చేసి షెడ్యూల్ ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

ఈసారి ముందుగానే షెడ్యూల్



మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించాం. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నుంచి యాసంగిలో నీటి విడుదలపై డిసెంబర్ 3న హైదరాబాద్‌లో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశం అనంతరం నీటి విడుదల ప్రణాళిక సిద్ధమతుంది. మూసీ ఆయకట్టు రైతుల కోరిక మేరకు గతంలో కంటే ఈసారి ముందుగానే నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ, మూసీ ప్రాజెక్టు

సాగులో ఉన్న భూములకే పట్టాలు

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

నాగార్జునసాగర్: సాగులో ఉన్న భూములకే ముందుగా పట్టాలు ఇవ్వాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని భూ సమస్యలను వంద శాతం పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వ ఎంపిక చేసింది. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు నెలలుగా మండలంలోని భూములపై సర్వే నిర్వహిస్తూ, సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ సమావేశ మందిరంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను అధికారులు సమావేశంలో ప్రస్తావించగా.. వాటన్నింటికి మాజీ మంత్రి జానారెడ్డి పలు సూచనలు చేశారు. తిరుమలగిరి(సాగర్) ప్రాంతంలో అధికంగా అటవీ, కాందిశీకుల, అసైన్డ్, పడావు భూములున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు కొంతమందికి ఇక్కడే పట్టాలు ఇచ్చారు. గతంలో అధికారులు భూములున్న దాని కంటే అత్యధికంగా పట్టాలు జారీ చేశారు. కొన్ని భూములు సాదాబైనామా పత్రాల మీదనే క్రయవిక్రయాలు జరిగాయి. వాటన్నింటిని గుర్తిస్తూ క్షేత్రస్థాయిలో ఎవరెవరికి ఎంతెంత భూమి ఉందో సర్వే చేస్తున్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు నేరుగా భూముల వద్దకు వెళ్లి సాగులో ఎవరు ఉంటే వారికి కచ్చితంగా ఏదో ఒకరకమైన పట్టా ఇవ్వాలని మాజీ మంత్రి జానారెడ్డి అధికారులకు సూచించారు. భూములపై వచ్చిన ఫిర్యాదుల గురించి జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఏడీ శ్రీనివాస్, డివిజనల్ సర్వేయర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ రమణయ్య, రామకృష్ణ, వేణుగోపాల్, చంద్రవదన, నిడమనూరు తహసీల్దార్ కృష్ణయ్య, చిట్యాల తహసీల్దార్ కృష్ణ, చండూరు తహసీల్దార్ దశరథ, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్) తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జానారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

క్లుప్తంగా

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 6 నెలల కాలపరిమితితో స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఏదేని డిప్లొమా పాసై ఉండాలని అన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ అండ్ సీసీ టీవీ టెక్నిషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. అలాగే టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని అన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. అభ్యర్థులు 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కల్గి ఉండాలని, ఆసక్తి కల్గిన వారు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో 9న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాల న్నారు. వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెన్‌పహాడ్: మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామ పరిధిలోని మూసీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు. నాగులపహాడ్ గ్రామానికి చెందిన మామిడి లింగయ్య, సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన ఉపేందర్, ట్రాక్టర్ డ్రైవర్లు, ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లారీలో డీజిల్ చోరీ

నూతనకల్: మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలో 365వ నంబర్ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీ నుంచి శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ దొంగిలించారు. డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కుమళ్ల గ్రామానికి చెందిన అనంతుల సత్యనారాయణ మహా సిమెంట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సిమెంట్ లోడ్‌తో మంచిర్యాలకు వెళ్తూ బిక్కుమళ్ల గ్రామంలోని తన ఇంటి ముందు లారీ నిలిపి ఇంట్లో నిద్రించాడు. శనివారం ఉదయం లేచి చూసేసరికి డీజిల్ ట్యాంకు పగులగొట్టి ఉండటం గమనించాడు. దగ్గరకు వెళ్లి చూడగా.. 450లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి: విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్(23) జీవనోపాధి కోసం కుటుంబంతో కలిసి వలస వచ్చి భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని ఓ షెడ్డులో నివాసముంటున్నాడు. నవంబర్ 28వ తేదీ సాయంత్రం మూత్ర విసర్జన కోసం అతడు షెడ్డు బయటకు వెళ్లగా.. కోతులు అతడి దగ్గరికి రావడంతో భయంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వైపు పరిగెత్తాడు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగడలంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ముగిసిన అర్వపల్లి దర్గా ఉర్సు


దీపాలు వెలిగిస్తున్న నిర్వాహకులు, భక్తులు


దర్గా వద్ద ఖవ్వాలీ కార్యక్రమం

అర్వపల్లి: అర్వపల్లి శివారులోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు శనివారం రాత్రితో ముగిసింది. శుక్రవారం సాయంత్రం గంధం ఊరేగింపు జరగగా.. అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు హైదరాబాద్‌కు చెందిన డబుల్ పార్టీ వారిచే ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాత్రి దర్గాలో దీపారాధన(చిరాగ్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా లోపల, బయట వందలాది దీపాలను వెలిగించారు. దీపారాధన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు. ఉర్సు విజయవంతానికి సహకరించిన వక్ఫ్ బోర్డు, పోలీస్, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులకు వక్ఫ్ బోర్డు ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ మహమూద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు టాస్క్‌ఫోర్స్ తహసీల్దార్ అహ్మద్ ఆసిఫ్ ఖాన్, దర్గా ముజావర్ సయ్యద్ అలీ, దర్గా కాంట్రాక్టర్ సయ్యద్ హబీబ్, మహ్మద్ హుస్సేన్, మున్నా, సోఫీ, శైలజ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మేరమ్మ (ఫైల్)

త్రిపురారం: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందింది. ఈ ఘటన నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. శనివారం నిడమనూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మడం గ్రామానికి చెందిన గోపోజు మేరమ్మ (30) కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం మేరమ్మ గ్రామంలో వరి నాట్లు వేసేందుకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. స్నానం చేసేందేకు ఇంటి ముందు ఉన్న స్నానాల గదిలోకి వెళ్లింది. స్నానం చేసిన అనంతరం తిరిగి బయటకు వస్తూ బాత్రూం తలుపును తెరిచింది. ఇనుప తలుపు కావడంతో పక్కనే కరెంట్ వైర్ తలుపునకు తగలడంతో బాత్రూం లో పడిపోయింది. మేరమ్మ కుమారుడు గమనించి బాత్రూం తలుపు తీయడంతో అతడికి కూడా కరెంట్ షాక్ రావడంతో కేకలు వేశాడు. కేకలు విన్న మేరమ్మ భర్త మధు వచ్చి కాపాడాడు. వెంటనే మేరమ్మను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మేరమ్మ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామ పంచాయతీ ట్యాంకర్ దుర్వినియోగం

- ముగ్గురి రిమాండ్

మఠంపల్లి: మఠంపల్లి గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్‌ను దుర్వినియోగం చేసిన వ్యక్తులను రిమాండ్‌కు తరలించి నీటి ట్యాంకర్‌ను మఠంపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. 2019లో స్థానిక సాగర్ సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం మఠంపల్లి గ్రామ పంచాయతీకి నీటి ట్యాంకర్‌ను బహూకరించింది. ఆ ట్యాంకర్‌ను మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఒకటో వార్డు మాజీ సభ్యురాలి భర్త గొలమారి ఆరోగ్యరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి దేవరం శ్రీకాంత్‌రెడ్డి కలిసి స్థానికంగా గల మైహోం సిమెంట్ పరిశ్రమలో లీజుకు పెట్టి వచ్చిన డబ్బులు ముగ్గురు పంచుకున్నారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మాడుగుల మట్టపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుర్రం సంగీత(22) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగీతకు మూడేళ్ల క్రితం చీకటిమామిడి గ్రామానికి చెందిన గుర్రం సంపత్‌తో వివాహం జరిగింది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సంగీత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు జరిగేవని, అంతేకాకుండా వారికి సంతానం లేకపోవడంతో సంగీత మానసిక వేదనకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు శనివారం రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోండి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సాక్షి, యాదాద్రి: పోలీసు ఉద్యోగాన్ని ప్రజలకు సేవ చేసేందుకు దక్కిన గొప్ప అవకాశంగా భావించాలని, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. హైదరాబాద్‌లోని నాగోల్ గల పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నూతన కానిస్టేబుల్స్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదని.. మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలని సూచించారు. నైపుణ్యానికి తగ్గట్టుగా అవకాశాలు ఉంటాయని, ఉన్నత చదువులు చదివి, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న వారిని సైబర్ క్రైం, ఐటీ సెల్ వంటి విభాగాల్లో నియమించేందుకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో రాచకొండ పోలీస్ అత్యున్నత సాంకేతిక పద్ధతులను వినియోగిస్తుందని, అందుకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.

కానిస్టేబుల్ స్థాయిలోనే ఆగిపోవద్దు

ఈ ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఆసక్తి ఉన్నవారు ఉన్నత హోదా కోసం శ్రద్ధగా తమ విశ్రాంతి సమయాన్ని వాడుకొని చదువుకోవాలని మరింత మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ నుంచి సివిల్ 265, ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు 466 మంది ఎంపికై తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: విద్యార్థులు అహర్నిశలు శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయంలో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నాట్కో ఫార్మా లిమిటెడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రహరీ, టాయిలెట్స్‌ను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కృష్ణా తీరంలో మారుమూల గ్రామాలు, తండాల అభివృద్ధికి గత 15 ఏళ్లుగా నాట్కో ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ పాఠశాలతో పాటు ఇంటర్మీయట్, డిగ్రీ కళాశాలలు ఉండటంతో విద్యార్థులందరికీ తాగు నీటిని అందించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు, విద్యార్థులు రోడ్డు దాటేందుకు వాక్‌వే బ్రిడ్జి నిర్మించేందుకు కృషిచేస్తామని తెలిపారు. నాట్కో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య, వ్యాపారం సమాజాభివృద్ధికి ఎంతో మేలు చేస్తుందన్నారు. నూతనంగా నిర్మించిన టాయిలెట్స్‌తో పాటు మరో 75 మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యే పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ,హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగ్తానాయక్, ఆదాసు నాగమణి, ప్రిన్సిపాళ్లు రాజశేఖర్, మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తదితరులు


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

చెరువులను పటిష్టం చేయండి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : వర్షాకాలం నాటికి నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ పటిష్టం చేయాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై మునుగోడు నియోజకవర్గంలోని చిన్ననీటి వనరులు, లభ్యత, వినియోగంపై సమీక్షించారు. భూగర్భ జలాలను పెంపునకు చెక్ డ్యాంల నిర్మాణం, ఫీడర్‌చానళ్ల పునరుద్ధరణ, చెరువుల్లో నీటిని నింపడానికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మునుగోడు నియోజకవర్గం అత్యధిక ఫ్లోరైడ్ కలిగిన ప్రాంతంగా ఉన్నందున ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి చెరువుల్లోకి మళ్లించాలన్నారు. అందుకోసం నియోజకవర్గంలోని 669 చెరువులను పటిష్టం చేయాలని సూచించారు. చెరువులు, కుంటలతో పాటు కాలువల్లో పూడిక తొలగించాలని, కట్టలకు మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. మండలాలవారీగా కమిటీలు ఏర్పాటు చేస్తానని, అధికారులు కమిటీలతో సమన్వయం చేసుకుంటూ సకాలంలో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈనెలలో సైట్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.


నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాగార్జునసాగర్ డ్యాంపై ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాంపై రెండు తెలుగు రాష్ట్రాల ఆక్టోపస్ దళాలు శుక్రవారం అర్ధరాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించాయి. గతంలో పట్టుబడిన సిమి ఆలిండియా కోశాధికారి సాగర్ వాసి కావడం, సాగర్ డ్యాం ఫొటోలు ఉగ్రవాదుల దగ్గర దొరకడంతో ఇంటలిజెన్స్ బ్యూరో ఇచ్చిన నివేదిక మేరకు డ్యాంకు భద్రతను భారీగా పెంచారు. దీంతో రెండేళ్లకోసారి సాగర్ డ్యాం పరిసరాలను ఆక్టోపస్ దళాలు సందర్శించి సంఘ విద్రోహశక్తులు డ్యాం దరికి చేరితే ఏవిధంగా ఎదుర్కోవాలో మాక్‌డ్రిల్ చేస్తుంటారు. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ పోలీసులు 50 మందితో పాటు ఆక్టోపస్ ఎస్పీలు హనుమంతారావు, గంగారెడ్డి, మరో నలుగురు డీఎస్పీలు, సాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ పాల్గొన్నారు.


సాగర్ డ్యాంపై మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళాలు

వానరానికి అంత్యక్రియలు

మునగాల: మండల పరిధిలోని రేపాల గ్రామంలో శనివారం వానరానికి(కోతి) గ్రామానికి చెందిన జంతుప్రేమికుడు, సామాజిక కార్యకర్త తుమ్మ సతీష్ అంత్యక్రియలు నిర్వహించారు. కొన్నిరోజుల క్రితం అనారోగ్యానికి గురైన వానరాన్ని గుర్తించిన సతీష్ జంతు సంరక్షణ హెల్ప్‌లైన్ నంబర్ 1962కు ఫోన్ చేసి దానిని రక్షించే ప్రయత్నం చేశారు. కానీ వానరం ఆరోగ్యం క్షీణించి శనివారం మృతిచెందింది. దీంతో సతీష్ గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో డప్పు చప్పుడుల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గడ్డం సురేందర్‌రెడ్డి, గడ్డం వీరారెడ్డి, మోత్కూరు ఉపేందర్, రావులపెంట వెంకయ్య, సొంటి పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.


మృతిచెందిన వానరం

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- విద్యార్థినుల పట్ల వెకిలి చేష్టలు
- నిడమనూరు మోడల్ స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ధర్నా

త్రిపురారం: విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జరిగింది. నిడమనూరు మోడల్ స్కూల్‌లో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు తరగతి గదిలో పాఠాలు చెప్పకుండా పుట్టు మచ్చలు ఎక్కడ ఉన్నాయని అడుగుతాడని, సినిమా హీరో, హీరోయిన్ల పేర్లు చెప్పాలని వేధింపులకు గురిచేస్తాడని విద్యార్థులు ఆరోపించారు. కావాలనే ఎక్కడ పడితే అక్కడ ఇబ్బందికరంగా తాకుతాడని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఎవరైనా పుట్టినరోజు నాడు కొత్త బట్టలు వేసుకుంటే చాలా బాగున్నావని అసభ్యంగా మాట్లాడతాడని తెలిపారు. బాలురను అకారణంగా కొడతాడని, బాలికలతో వెకిలిగా మాట్లాడుతూ నవ్వుతాడని ఆరోపించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు విషయం చెప్పగా.. శనివారం విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి వారు స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్నారని తెలుసుకున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్ గౌడ్‌తో కలసి పాఠశాల వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్ బూరుగు నిర్మలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలోని పరిస్థితులను తెలుసుకున్నామన్నారు. ఆరోపణలు వచ్చిన ఉపాధ్యాయుడిని విధుల్లోకి రావొద్దని ఆదేశించామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయాలని కలెక్టర్‌ను కోరామని, విచారణలో ఆరోపణలు రుజువైతే సదరు ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



సోషల్ ఉపాధ్యాయుడు వేధిస్తున్నాడని చెబుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకున్నారు

విద్యార్థులు తనను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని, క్షమాపణ చెబుతానని ఉపాధ్యాయుడు ఆంజనేయులు అన్నారు. ఒక అమ్మాయి మెడపై ఎర్రగా పెద్ద మచ్చ ఉండడంతో.. ఏదైనా వ్యాధి సోకిందేమోనని మెడ వద్ద తాకి చూసినట్లు ఉపాధ్యాయుడు చెప్పడం గమనార్హం.

ఫిర్యాదు రాలేదు

నిడమనూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థినులను ఉపాధ్యాయుడు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు నాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. నేను ప్రస్తుతం సెలవులో ఉన్నాను. ఫిర్యాదు వస్తే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– లావూరి వెంకన్ననాయక్, ఎంఈఓ, నిడమనూరు

విద్యార్థులు ఫిర్యాదు చేశారు

సోషల్ ఉపాధ్యాయుడు తమను వేధిస్తున్నాడని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ప్రతి తరగతిలో విద్యార్థులతో మాట్లాడి విచారణ చేశాను. విద్యార్థులకు ఇష్టం లేకపోతే ఉపాధ్యాయుడిని పాఠాలు చెప్పేందుకు తరగతి గదికి పంపనని చెప్పాను. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– బూరుగు నిర్మల, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, నిడమనూరు